KILLER
END OF SEASON SALE
FLAT 50% OFF
ON PURCHASE OF 2
BUY 1 GET 30%
*ON SELECTED MERCHANDISE *T&C APPLY
PALAKONDA ROAD, SRIKAKULAM

అడ్మిషన్లు జరుగుచున్నవి
రవాణా సదుపాయం కలదు
డాక్టర్ దండి సూర్యనారాయణ ఎడ్యుకేషనల్ సొసైటీ వారి
శ్రీ శ్రద్ధ ప్లేస్కూల్ A/C
Right Place for Right Education
(LKG to 5th Class)
కామేశ్వరి కళ్యాణమండపం దగ్గర, నందల జంక్షన్, నక్కవీధి, కలెక్టర్ బంగ్లా రోడ్డు, శ్రీకాకుళం, 99893 03703

TET - సైకాలజీ, తెలుగు ఇంగ్లీష్
DSC - SGT, SA - సోషల్, తెలుగు, బయాలజీ
సోషల్ మెథడ్స్- ఉపేంద్రనాయుడు సార్ - జూలై 7th
సైకాలజీ, ట్రైమెథడ్స్, PIE- సైదులు సార్ - జూలై 12,13,14
రైల్వే(RRB)/SSC/కానిస్టేబుల్స్/SI/BANK RPF AP
స్పెషల్ బ్యాచ్: అర్థమెటిక్, రీజనింగ్, ప్యూర్ మేథ్స్ 'చలం' రవి, M.వేణుగోపాల్, మల్లిక్, Ch.శంకర్, కృష్ణమూర్తి, Sirsచే
9AM - 7PM సెమినార్, 10 రోజులు ఫ్రీ డెమో క్లాసులు
SOLVE ACADEMY
పౌర గ్రంథాలయం, వైజాగ్-16 | RTC కాంప్లెక్స్, శ్రీకాకుళం
7569089825, 8688172010

సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
బుధవారం 14-8-2024
సంపుటి: 20 సంచిక: 121
పేజీలు: 4 వెల: రూ.1



ఏ ప్రభుత్వం వచ్చినా సామాజిక పెన్షన్ లబ్ధిదారులకు టెన్షన్ తప్పడంలేదు. ఒక్కో ప్రభుత్వం ఒక్కోరకమైన నిబంధనలు పెడుతుండటం వారిని గందరగోళానికి గురిచేస్తోంది. గత వైకాపా ప్రభుత్వం ఠంచనుగా ప్రతినెలా ఒకటో తేదీనే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్ మొత్తం అందించేది. అయితే కొత్తగా పెన్షన్ కావాలనుకునేవారు మాత్రం గరిష్టంగా ఆరు నెలలు ఎదురుచూడాల్సి వచ్చేది. 2019కి ముందున్న తెలుగుదేశం ప్రభుత్వం గతంలో ఏ నెలకానెల కొత్త వారిని ఎంపిక చేసేది. ఇప్పుడు అదే సర్కారు మళ్లీ అధికారంలోకి వచ్చినా కొత్త పెన్షన్ల మంజూరుపై ఇంతవరకు స్పందించ లేదు. పెన్షన్‌కు దరఖాస్తు చేసుకోవాలంటే తప్పనిసరిగా తెల్లరేషన్ కార్డు ఉండాలి. కానీ ఆ కార్డుల జారీ నిబంధనలను మార్చడంతో అదో సమస్యగా మారే ప్రమాదం ఉంది. వివాహ నమోదు ధ్రువీకరణ పత్రం ఉంటేనే రేషన్‌కార్డులు ఇవ్వాలని చంద్రబాబు సర్కారు స్థూలంగా ఒక నిర్ణయానికి రావడంతో ఆ ప్రభావం పెన్షన్ దరఖాస్తుదారులపై పడుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

# నిబంధనల ఫీట్లు.. పెన్షనర్ల పాట్లు!

- ఒక్కో ప్రభుత్వంలో ఒక్కో రకమైన మార్గదర్శకాలు
- ఏడు నెలలుగా దరఖాస్తుకు అర్హుల నిరీక్షణ
- ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ ఊసెత్తని సర్కారు
- రేషన్‌కార్డు మంజూరుకు ఇక వివాహ పత్రం తప్పనిసరి
- తెల్ల రేషన్‌కార్డు లేకపోతే పెన్షన్‌కు అనర్హులే

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

గతంలో టీడీపీ సర్కారు ఉన్నప్పుడు జన్మభూమి కమిటీలతో పరిశీలన జరిపించి గ్రామ కార్యదర్శుల ద్వారా కొత్త పెన్షన్లు మంజూరు చేసేది. ఆ ప్రభుత్వంలో ఒకటి రెండు నెలలు ఏవో కారణాలతో పింఛను తీసుకోని వారికి గరిష్టంగా మూడునెలల వరకు ఒకేసారి తీసుకునే వెసులుబాటు ఉండేది. దాంతోపాటు కొత్త పెన్షన్లకు దరఖాస్తు ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగేది. అందిన దరఖాస్తులను వారానికోసారి పరిశీలించి నెలాఖరు నాటికి అర్హులైనవారి జాబితా ప్రకటించేది. ఆ మరుసటి నెల నుంచే వారు పింఛన్ అందుకునేవారు. 2019లో వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ విధానానికి బ్రేక్ పడింది. వలంటీర్ల ద్వారా లబ్ధిదారుల వద్దకు వెళ్లి బయోమెట్రిక్, ఐరిష్ ద్వారా పింఛన్లు పంపిణీ చేసేవారు. అయితే ఒక నెల పింఛను అందుకో లేకపోతే అంతే సంగతులు.. వచ్చే నెల దాన్ని కలిపి కాకుండా ఆ నెల పింఛన్ మాత్రమే ఇవ్వడం ప్రారంభించారు. ఇలా వరుసగా రెండు నెలలు పింఛను తీసుకోనివారికి మూడో నెల నుంచి పూర్తిగా కట్ చేసేసేవారు. మళ్లీ దాన్ని పునరుద్ధరించుకోవడానికి లబ్ధిదారులు సచివాలయంలో దరఖాస్తు చేస్తే వారితో ఈకేవైసీ చేయించి తర్వాత నెలలో పింఛను మంజూరు చేసేవారు. దీనివల్ల వలస వెళ్లిన లబ్ధిదారులు నష్టపోతున్నారు. ఈ నిబంధనను పునఃసమీక్షించాలని వలస లబ్ధిదారులు

- మిగతా 4లో



# జిల్లాలో మూడు అన్న క్యాంటీన్లు

## - ప్రారంభించనున్న మంత్రులు -

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లాలో మూడుచోట్ల అన్న క్యాంటీన్లను ప్రారంభించడానికి అధికారులు సన్నద్ధమవుతున్నారు. పంద్రాగస్టును పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లను కూటమి ప్రభుత్వం ప్రారంభించడానికి నిర్ణయించింది. అందులో భాగంగా జిల్లా కేంద్రంలో పాతబస్టాండ్, ఏడురోడ్ల కూడలి, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీల్లో బస్టాండ్ వద్ద ఒకటి ప్రారంభానికి సిద్ధమయ్యాయి. వీటిని ఈ నెల 16న కేంద్ర, రాష్ట్ర మంత్రులు స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి ప్రారంభించనున్నారు. 2018 ఆగస్టులో ప్రారంభమైన అన్నక్యాంటీన్లు 2019 ఫిబ్రవరిలో మూతపడ్డాయి. వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదేళ్లపాటు తెరుచుకోలేదు. చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గతంలో మూతపడిన అన్నా క్యాంటీన్లను పునరుద్ధరించి తెరపించడానికి మున్సిపల్‌శాఖ ద్వారా ఒక్కో క్యాంటీన్‌కు రూ.13లక్షలు నిధులు విడుదల చేశారు. ఈ నిధులను వెచ్చించి గతంలో నిర్మించిన భవనాలను క్యాంటీన్లుగా

- మిగతా 4లో



శ్రీ ముత్యాలమ్మ ఆశీస్సులతో...
హోటల్ గజపతి
స్పెషల్ దోశెలు
★ మేగీ దోశె
★ పిజ్జా దోశె
★ పాలక్ దోశె
★ పన్నీరు దోశె
★ మష్రూమ్ దోశె
★ ఘీ కారం దోశె
★ కారంపల్లి దోశె
★ స్వీట్ కార్న్ దోశె
★ చీజ్ ఆన్ పన్నీర్ దోశె
★ మంచూరియన్ దోశె
9581511345
9701711345
ఇప్పుడు ప్రశాంతమైన ఎ.సి. వాతావరణంలో మరింత సౌకర్యవంతంగా ఎటువంటి అధనపు చార్జీలు లేకుండా ప్రత్యేకంగా సర్వీసు అందిస్తున్నాం. విచ్చేయండి...

పేపర్ బాయ్స్ కావలెను
సంచలన సాయంకాల పత్రిక 'సత్యం'లో పని చేసేందుకు పేపర్‌బాయ్స్ కావలెను.
- సంప్రదించండి -
94414 66455

- గురువారం నుంచి రాష్ట్రంలో ఇంటింటా స్క్రీనింగ్
- లక్షణాలు ఉన్న, ప్రాథమిక దశలో ఉన్నవారికి ఉన్నత వైద్యం
- ప్రజల్లో అవగాహన కల్పించడం, చికిత్సకు సిద్ధం చేయడమే లక్ష్యం
- కార్యక్రమంలో కీలక భూమిక పోషిస్తున్న పీఎంపీ అసోసియేషన్
- రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో సదస్సులు, ర్యాలీలు

# క్యాన్సర్‌పై యుద్ధం!

**క్యాన్సర్.. ఈ పేరు వినగానే దాదాపు అందరూ అమ్మో.. అని భయపడి పోతారు. ఇక దానికి గురైనవారైతే.. తమ జీవితం రోజుల్లోకి వచ్చేసిందని బెంగ పెట్టుకుంటారు. ఈ అపోహలు, భయాలే క్యాన్సర్ పేషెంట్లను మరణానికి మరింత చేరువ చేస్తున్నాయి. దీనికితోడు అవగాహన లేకపోవడం, ప్రాథమిక దశలోనే క్యాన్సర్ లక్షణాలను గుర్తించకపోవడం వల్లే పరిస్థితి విషమించి క్యాన్సర్ మరణాలకు కారణమవుతోంది. గతానికి ఇప్పటికీ పరిస్థితిలో చాలా మార్పు వచ్చినా.. ఇంకా గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలు క్యాన్సర్ లక్షణాలు కనిపించినా నిర్లక్ష్యం చేస్తూ ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు, ఇంటింటి సర్వేలు నిర్వహిస్తే క్యాన్సర్ మహమ్మారి నుంచి ప్రజలను చాలావరకు రక్షించవచ్చని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. స్వాతంత్ర్య దినోత్సవమైన ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ మహాక్రతువులో కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పీఎంపీ అసోసియేషన్) కీలక భాగస్వామ్యం వహిస్తోంది.**

(డి.వి.రమణ, సత్యం ప్రత్యేక ప్రతినిధి)

రాష్ట్రవ్యాప్తంగా క్యాన్సర్‌పై పోరాటానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గురువారం(ఆగస్టు 15) నుంచి ఇంటింటికీ వెళ్లి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించేందుకు ఇప్పటికే వేలాదిమంది పారామెడికల్ సిబ్బందిని సిద్ధం చేసింది. వీరందరికీ స్క్రీనింగ్ నిర్వహణలో ఇప్పటికే నిపుణులతో శిక్షణ ఇప్పించారు. ఈ బృహత్తర కార్యక్రమంలో పలు ప్రైవేట్, స్వచ్ఛంద సంస్థలు కూడా భాగస్వామ్యమవుతున్నాయి. రాష్ట్ర పారామెడిక్స్ అండ్ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పూర్తిస్థాయిలో పాలుపంచుకుంటోంది. ఈ సంఘం గత కొన్నాళ్లుగా రాష్ట్రంలో నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో నిపుణులతో అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహిస్తోంది. అందులో భాగంగా బుధవారం శ్రీకాకుళంలో కూడా ఈ కార్యక్రమం భారీగా నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి స్క్రీనింగ్ నిర్వహించడం వల్ల క్యాన్సర్ లక్షణాలు ఇప్పుడిప్పుడే ఏర్పడుతున్నవారికి, ప్రాథమిక దశలో ఉన్న వారికి తక్షణమే చికిత్స అందించి రక్షించే అవకాశం ఉంటుందని శ్రీకాకుళం పీఎంపీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వందన సిమ్మన్న, ఎన్.లక్ష్మీనారాయణ, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.బి.టి. రాజు చెప్పారు. మన రాష్ట్రంలో ప్రతి ఏటా సుమారు 70వేల మంది క్యాన్సర్ బారిన పడుతుండగా వారిలో 50వేలమంది వరకు చనిపోతున్నారని అంచనా. ప్రభుత్వ రికార్డుల ప్రకారమే ఈ అంచనా వేస్తున్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నవారు, అసలు క్యాన్సర్ లక్షణాలు తెలియకుండానే కన్నుమూస్తున్న వారి సంఖ్య కూడా ఎక్కువగానే ఉంటుందని అంచనా. క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే చికిత్స సులభం అవుతుంది. లేకపోతే మరికొన్నేళ్లలో బీపీ, షుగర్ పేషెంట్స్ మాదిరిగా ప్రతి ఇంటిలోనూ క్యాన్సర్ రోగులు ఉంటారని చెప్పడం అతిశయోక్తి కాదు.

### 2026 నాటికి ఏటా 20 లక్షల మరణాలు!

ఢిల్లీలోని ఎయిమ్స్ అంచనా ప్రకారం 2026 నాటికి మన దేశంలో ఏటా 20 లక్షల మంది క్యాన్సర్‌తో మరణిస్తారని ఫిబ్రవరిలో వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. 2020లో దేశంలో 13.92 లక్షల మంది క్యాన్సర్ బారిన పడగా, ఆ సంఖ్య 2021నాటికి 14.26 లక్షలకు, 2022 నాటికి 14.61 లక్షలకు పెరిగింది. ఇక క్యాన్సర్ మరణాల సంఖ్య 2018లో 7.33 లక్షలు ఉండగా 2022 నాటికి 8.08 లక్షలకు పెరిగింది.

### మన రాష్ట్రంలో పరిస్థితి ఏమిటి?

అమెరికాకు చెందిన హెల్త్ ఎఫెక్ట్ ఇన్‌స్టిట్యూట్ గ్లోబల్ బర్డెన్ ఆఫ్ డిసీజ్(జీబీడీ) పేరుతో ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించని అధ్యయనం ప్రకారం 2016 నాటికి రాష్ట్రంలో ప్రతి లక్షమందిలో 93.3 మంది ఈ వ్యాధికి గురవుతున్నారు. అదే సమయంలో క్యాన్సర్ స్క్రీనింగ్ రేట్ మాత్రం చాలా తక్కువగా ఐదు శాతం మాత్రమే ఉందట. పరిస్థితి ఇలాగే కొనసాగితే 2030 నాటికి రాష్ట్రంలో క్యాన్సర్ రోగుల సంఖ్య 132 శాతం పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ఇక రాష్ట్రానికి చెందిన ఆరోగ్యశ్రీ ట్రస్ట్ లెక్కల ప్రకారం 2021-22లో క్యాన్సర్ రోగుల సంఖ్య 1,31,345. ఇందులో అత్యధికంగా 33,530 మంది బ్రెస్ట్ క్యాన్సర్ బారిన పడ్డారు. సెర్విక్స్ కాన్సర్ 18,956 మందికి, ఓరల్ కేవిటీ క్యాన్సర్ 2492 మందికి, ఎముకల క్యాన్సర్ బాధితులు 481 మంది, కార్డియోథొరాసిక్ కేసులు 64, సీఎన్ఎస్ 1992, కొలోరెక్టల్ 10352, గ్యాస్ట్రిక్ 4875, జెనిటోరినరీ 2324, జీఐటీ 4006, గైనిక్ 7022, తల మెడకు సంబంధించి 1183, హెమటో అంకాలజీ 22,393, ఊపిరితిత్తులు 5110, మస్కులోస్కెలిటర్ 518, మల్టిపుల్ మైలోమా 7338, చిన్నపిల్లల కేసులు 2274, ప్రోస్టేట్ 529, యూరాలజీ 794 కేసులు ఉన్నాయి. 2022 లెక్కల ప్రకారం ఉమ్మడి జిల్లాలైన తూర్పు గోదావరిలో అత్యధికంగా 18,433 కేసులు ఉన్నాయి. అతిస్వల్పంగా కడప జిల్లాలో 5738 ఉన్నాయి. అనంతపురంలో 8121, చిత్తూరులో 7133, గుంటూరులో 18110, క్రిష్ణాలో 12247, కర్నూలులో 9275, నెల్లూరులో 7197, ప్రకాశంలో 10142, శ్రీకాకుళంలో 6292, విశాఖపట్నంలో 10124, విజయనగరంలో 6273, పశ్చిమ గోదావరిలో 12260 కేసులు ఉన్నట్లు గుర్తించారు.

### వ్యాధి వ్యాప్తికి కారణాలు

మానవ శరీరం మొత్తం కణజాలంతో నిండి ఉంటుంది. శరీరంలో ఎక్కడైనా కణజాలం అవసరం లేకుండా ఎక్కువగా పెరిగిపోతే క్యాన్సర్‌కు దారితీస్తుందని క్యాన్సర్ నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా శరీరంలో కణాల విభజన జరుగుతుంది. ఇలా ప్రతి కణం విభజనకు గురై పుడుతూ, చనిపోతూ ఉంటాయి. ఈ ప్రక్రియకు విఘాతం ఏర్పడితే కొన్ని కణాలు చనిపోకుండా అలాగే ఉండిపోతాయి. కణాల్లో ఉండే డీఎన్ఏలో మార్పుల వల్లే ఈ పరిస్థితి ఏర్పడుతుంది. ఆహార అలవాట్లు, రేడియేషన్, స్మోకింగ్, ఊబకాయం తదితర కారణాల వల్ల కూడా డీఎన్ఏలో మార్పులు వస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఈ అంశాలపై ప్రజలను అప్రమత్తం చేయడంతోపాటు పరీక్షలకు సిద్ధమయ్యేలా చేయడమే ప్రస్తుతం చేపడుతున్న సామూహిక స్క్రీనింగ్, అవగాహన కార్యక్రమాల లక్ష్యమని నిర్వాహకులు చెబుతున్నారు.

# క్యాన్సర్ నిర్మూలనలో భాగస్వామ్యం కావాలి

## శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్

### కమ్యూనిటీ పారామెడిక్స్, ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, జెమ్స్ ఆధ్వర్యంలో అవగాహన



(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

ప్రజల ప్రాణాలను కబళిస్తున్న మహమ్మారి క్యాన్సర్ వ్యాధిని అరికట్టాలన్న ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చే బాధ్యత ప్రైవేటు మెడికల్ ప్రాక్టీషనర్స్‌పై ఉందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఏడురోడ్ల కూడలిలోని ప్రెస్‌క్లబ్‌లో కమ్యూనిటీ పారామెడిక్స్, ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, జెమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ క్యాన్సర్‌ను తొలిదశలో గుర్తిస్తే దీని బారి నుంచి బయట పడవచ్చన్నారు. ప్రజలకు అవగాహన లేకపోవడం వలనే నాలుగో దశలో గుర్తిస్తున్నారని, అప్పటికే తీవ్రనష్టం వాటిల్లుతోందన్నారు. క్యాన్సర్ అనే పదం వింటే ఒక రకమైన ఆందోళన మనలో కలుగుతుందని, ఇది ప్రాణాలుతీసే అత్యంత ప్రమాదకరమైన వ్యాధని చాలామంది భావిస్తున్నారని, క్యానర్స్ పేషెంట్లు చాలామంది ఒకానొక సమయంలో బాగా బరువు తగ్గిపోతుంటారని చెప్పారు. ఐదు లేదా అంతకంటే ఎక్కువ కేజీలు బరువు తగ్గిపోవడాన్ని క్యాన్సర్ తొలి సంకేతంగా చూడొచ్చునని పేర్కొన్నారు. క్యాన్సర్ వచ్చిన రోగుల్లో జ్వరమనేది సాధారణ లక్షణమని, క్యాన్సర్ పుట్టిన దగ్గర నుంచి ఇతర అవయవాలకు, శరీర భాగాలకు వ్యాప్తి చెందేటప్పుడు జ్వరం వస్తూ ఉంటుందని స్పష్టం చేశారు. విపరీతంగా దగ్గు రావడం కూడా ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు సంకేతమని తెలిపారు. ప్రైవేటు మెడికల్ ప్రాక్టీషనర్స్ ప్రతీ వీధిలోనూ, సందులోనూ ఉంటారని, ప్రజలకు అవగాహన కల్పించి క్యానర్స్ నిర్మూలనకు పాటుపడాలన్నారు. అనంతరం ఏడురోడ్ల కూడలి వద్ద క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వండాన సిమ్మన్న, కార్యదర్శి నక్క లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు ఆదినారాయణ, కోశాధికారి కె.జనార్ధన, జాయింట్ సెక్రటరీ సీహెచ్ రాము, సీనియర్ మెంబర్ డోల వాసు, అప్పలరాజు, ముసలినాయుడు, కె.మోహనరావు, రాజారావు, జెమ్స్ వైద్యులు బమ్మిడి సందీప్, ఎం.వెంకటరమణ, నందన రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

• ఎడిటోరియల్

# దారికొచ్చిన మాల్దీవులు!

మాల్దీవుల్లో ఉన్న భారత సైనికులందరూ తక్షణమే వెళ్లిపోవాలని దాదాపు ఏడాది క్రితం ఆ ద్వీప దేశం అధ్యక్షుడు హుంకరించారు. ఇప్పుడు అదే అధ్యక్షుడు మా దేశంలోని 28 దీవులను ఇచ్చేస్తున్నాం.. తీసుకోండి అంటూ ఉదారంగా వ్యవహరించారు. ఏడాదిలోనే ఇంత మార్పు ఏంటబ్బా? అని ఈ కథ తెలియని వారు ఆశ్చర్యపోవచ్చు. చైనా కోసం భారత్‌ను కాలదన్నుకున్న ఫలితం మాల్దీవులకు కొద్దిరోజుల్లోనే తెలిసి వచ్చిన ఫలితమే ఈ మార్పు. దీనికంతటికీ కారకుడు ఆ దేశ కొత్త అధ్యక్షుడు మొహమ్మద్ మొయిజ్జు. వాస్తవానికి మనదేశానికి నైరుతి దిశలో హిందూ మహాసముద్రంలో ఉన్న మాల్దీవులకు సంప్రదాయకంగా శతాబ్దాల క్రితం నుంచి సంబంధ బాంధవ్యాలు ఉన్నాయి. ఏడాది క్రితం వరకు ఉన్న ప్రభుత్వాలు కూడా భారత్‌తో వర్తక, వాణిజ్య, స్నేహ సంబంధాలు కొనసాగిస్తూ వచ్చాయి. కానీ గత నవంబర్‌లో జరిగిన ఎన్నికల అనంతరం పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఆ ఎన్నికల్లో భారత అనుకూలవాది అయిన అప్పటి అధ్యక్షుడు ఇబ్రహీం మొహమ్మద్ సోలి ఓడిపోయి.. చైనా అనుకూలవాది అయిన మొహమ్మద్ మొయిజ్జు అధికారంలోకి వచ్చారు. ప్రభుత్వ పగ్గాలు చేపట్టడమే ఆలస్యం.. భారత్‌పై యుద్ధం ప్రకటించినంత పనిచేశాడు. మాల్దీవుల్లో తీరరక్షణ కోసం ఆ దేశ అనుమతితోనే భారత ప్రభుత్వం నిర్వహిస్తున్న సైనిక శిబిరాన్ని ఎత్తివేయాలని, భారత సైనికులందరూ తక్షణమే వెళ్లిపోవాలని మొయిజ్జు ఆదేశించారు. చైనా తమకేదో సాయం చేసేస్తుందన్న భ్రమల్లో ఉండి భారత్‌కు దూరమయ్యారు. శతాబ్దాలుగా కొనసాగుతున్న ద్వైపాక్షి సంబంధాలను తెంచుకునేలా వ్యవహరించారు. అదే సమయంలో మొయిజ్జు ప్రభుత్వంలో పలువురు మంత్రులు సైతం దుందుడుకుతనం ప్రదర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీపైనే విమర్శలకు తెగించారు. ఈ పరిణామాలు ఇరుదేశాల మధ్య సంబంధాలను దెబ్బతీసి, ఉద్రిక్తతలు పెంచాయి. తర్వాత మాల్దీవుల ప్రభుత్వం భారత్‌కు క్షమాపణ చెప్పినా అప్పటికే జరగాల్సిన డ్యామేజీ జరిగిపోయింది. మాల్దీవుల ఆర్థిక రంగమంతా పర్యాటక ఆదాయంపైనే ఆధారపడి ఉంది. అందులోనూ భారత్ నుంచి వెళ్లే టూరిస్టుల ద్వారానే అత్యధిక ఆదాయం లభిస్తోంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రధాని మోదీ లక్షదీవుల పర్యటనకు వెళ్లి అక్కడి సుందర ప్రదేశాలను ప్రస్తావిస్తూ మాల్దీవులకు బదులు భారతీయ పర్యాటకులు లక్షదీవులను సందర్శించాలని సూచించారు. దీన్ని కూడా మాల్దీవుల ప్రభుత్వ నేతలు తక్కువ చేసి మాట్లాడారు. మాల్దీవుల్లోని పర్యాటక ప్రాంతాల్లో ఉన్న సౌకర్యాలు, స్వచ్ఛత, ఆహ్లాదం లక్షదీవుల్లోగానీ, భారత్‌లోని ఇతర పర్యాటక ప్రాంతాల్లో లభిస్తుందా? అన్న సవాళ్లు చేశారు. దాంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. బాయ్‌కాట్ మాల్దీవులు అన్న నినాదం భారత్‌లో ట్రెండింగ్‌లోకి వచ్చింది. పర్యాటకులు, క్రికెట్, సినీ, ఇతర రంగాలకు చెందిన సెలబ్రిటీలందరూ దీన్నే ఫాలో కావడంతో పాటు ప్రచారం చేయడంతో మాల్దీవుల పర్యాటక రద్దీ అంతా లక్షదీవుల వైపు మరలిపోయింది. ఫలితంగా మాల్దీవుల ఆదాయం పడిపోయింది. టూరిజంపై ఆధారపడిన హోటళ్లు, ఇతర రంగాలు కుదేలైపోయాయి. మరోవైపు ఆదుకుంటుందని ఆశలు పెట్టుకున్న చైనా హ్యాండిచ్చింది. అలాగే చైనా నుంచి వచ్చే టూరిస్టుల ద్వారా వచ్చే ఆదాయం అంతంతమాత్రమే. దాంతో మాల్దీవుల ఆర్థిక పరిస్థితి గాడి తప్పింది. కాగా ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో ఇరుగుపొరుగు దేశాలకు ఇచ్చే ఆర్థిక సాయం కేటగిరీలో మాల్దీవుల వాటాలో భారత సర్కారు భారీగా కోత విధించింది. ఫలితంగా ఆ దేశం పరిస్థితి కుడితిలో పడిన ఎలుక చందంగా తయారైంది. ఆర్థిక పరిస్థితి గాడిలో పడాలంటే ఇప్పటికిప్పుడు 1.3 బిలియన్ డాలర్లు అవసరం. దానికోసం అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్)ను సంప్రదించినా అటు నుంచి సరైన స్పందన రాలేదు. మొయిజ్జు అడ్డగోలు విధానాలతో భారత వ్యతిరేక చర్యలు చేపట్టడం వల్లే ఈ దుస్థితి దాపురించిందని దేశంలో ప్రతిపక్షాలు తీవ్రంగా తప్పుపడుతున్నాయి. అక్కడి ప్రజలు కూడా తమను ఆదుకోమని భారత్‌ను విజ్ఞప్తి చేయసాగారు. హాసన్ ఖురేషి అనే మాల్దీవుల సీనియర్ సిటిజన్ సోషల్ మీడియాలో ఒక పోస్టు పెడుతూ 'మా దేశానికి తక్షణం 1.3 బిలియన్ డాలర్లు అవసరం. భారతీయులందరూ దయచూపి తలా ఒక డాలర్ ఇచ్చి ఆదుకుంటే ఆర్థిక కష్టాల నుంచి బయటపడతాం' అంటూ తమ దేశ పరిస్థితిని చెప్పకనే చెప్పాడు. ఇక మొయిజ్జుకు కూడా వేరే మార్గాంతరం కనిపించలేదు. అన్యధా శరణం నాస్తి.. అంటూ ఇప్పుడు భారత్ ముందుకు మోకరిల్లక తప్పలేదు. తమ దేశంలో పర్యటించాలని, ద్వైపాక్షిక సంబంధాలు పటిష్టం చేసుకుందాం రండి మహాప్రభో.. అని మొయిజ్జు సర్కారు ఆహ్వానం మేరకు భారత విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ మాల్దీవుల్లో అడుగుపెట్టారు. ఆ దేశ అధ్యక్షుడు మొయిజ్జుతో భేటీ అయ్యారు. ఇరుదేశాల సంబంధాల మెరుగుకు భారత్ కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగానే పగడపుదీవుల సమూహమైన మాల్దీవులకు చెందిన 28 చిన్న చిన్న దీవులను భారత్‌కు ఇస్తున్నట్లు మొయిజ్జు ప్రకటించారు. ఈ ఒప్పందంపై సంతకం కూడా చేశారు. ఇకనుంచి ఈ దీవులు భారత నియంత్రణలో ఉంటూ అభివృద్ధి సాధిస్తాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో భాగంగానే భారత సహాయంతో సంయుక్తంగా పూర్తిచేసిన ఆరు ప్రాజెక్టులను జైశంకర్ ప్రారంభించారు. మాల్దీవులతో మళ్లీ దౌత్య, స్నేహ సంబంధాల పునరుద్ధరణ చైనాకు వ్యతిరేకంగా భారత్ సాధించిన పెద్ద విజయంగా చెప్పవచ్చు.

## ఖ్యాతి వృద్ధాశ్రమంలో అన్న వితరణ




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కొంక్యాన గోవిందరాజులు 14వ వర్ధంతి సందర్భంగా నగరంలోని ఖ్యాతిఫౌండేషన్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నవితరణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొంక్యాన గోవిందరాజులు ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్ మురళీధర్ మాట్లాడుతూ అన్నదానం మహాదానమని, నిరుపేదల ఆకలి తీర్చటం ఎంతో ఆనందాన్నిస్తుందని అన్నారు. తమ ట్రస్టు ద్వారా ఫౌండేషన్‌కు అవసరమైన సామగ్రిని అందిస్తామని ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్, సరోజ, ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ దవళ ఆనందరావు, అల్లు వెంకటరమణ, ఖ్యాతి ఫౌండేషన్ ఫౌండర్ డాక్టర్ ఆర్.శ్రావణి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## జీజీహెచ్ఎస్‌లో 'క్వశ్చన్ ఆఫ్ ది ఇయర్'



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీకాకుళం యూఎల్‌బీ విద్యాకార్యదర్శులు స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో క్వశ్చన్ ఆఫ్ ది ఇయర్ కార్యక్రమాన్ని స్కూల్ హెచ్ఎం వాగ్దేవి సహకారంతో బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థుల నుంచి సందేహాలను సేకరించి, త్వరలో ఉత్తమ ప్రశ్నలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు.

## హోంమినిస్టర్‌ను కలసిన ఎమ్మెల్యే మామిడి

(సత్యంన్యూస్, పాతపట్నం)

రాష్ట్ర విపత్తు నిర్వహణ, హోం శాఖ మంత్రి వంగలపూడి అనితను పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు విశాఖపట్నంలోని ఆమె స్వగృహంలో కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణపై, గంజాయి రవాణా, వాడకం అరికట్టాలని, ఎల్.ఎన్.పేట మండలానికి పోలీస్‌స్టేషన్, పాతపట్నం నియోజకవర్గం కేంద్రంలో ఫైర్‌స్టేషన్ ఏర్పాటు, మెళియాపుట్టి పోలీస్ స్టేషన్‌కు వాహన సదుపాయం గూర్చి చర్చించారు. వినతులపై హోం మినిస్టర్ అనిత సానుకూలంగా స్పందించి త్వరలోనే పరిష్కరించే విధంగా చర్యలు చేపడతానని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.



సిక్కోలు స్వచ్ఛంద సేవాసమితి

## రూ.15వేలు సాయం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

బ్రెయిన్‌లో నీరు చేరి ఆసుపత్రిలో వైద్యచికిత్స పొందుతున్న కిష్టప్పపేట, బగ్గువానిపేట గ్రామానికి చెందిన కుర్మపు ప్రసాద్‌కు సిక్కోలు స్వచ్ఛంద సేవాసమితి రూ. 15వేలు సాయమందించింది. ప్రసాద్ ఇంటర్ చదువుతూ చురుకుగా ఉండేవాడు. కొన్ని రోజుల ముందు అనారోగ్యం బారిన పడటంతో బగ్గు సరోజినీ వైద్యశాలకు వెళ్లగా, పరీక్షించిన వైద్యులు బ్రెయిన్‌లో నీరు చేరిందని, కోమాలోకి వెళ్లే అవకాశాలున్నాయని తెలిపారు. తల్లిదండ్రులు ఆర్థికంగా వెనుకబడిన కుటుంబం కావటంతో మందులకు కూడా ఇబ్బంది పడుతుండటంతో గ్రామస్థుల సహకారంతో వైద్యశాలకు తరలించి, సిక్కోలు స్వచ్ఛంద సేవసమితిని సంప్రదించారు. వారు పూర్తి వివరాలు సేకరించిన అనంతరం దాతల సహకారంతో సమకూర్చిన రూ.15వేల ఆర్థిక సాయాన్ని బుధవారం వైద్యశాలకు వెళ్లి బాధితునికి అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు మధు, అవినాష్, మహాలక్ష్మీ, చరణ్, ఉమాశంకర్, రమణ, ఉర్లం శివతేజ, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## పలాసలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ

(సత్యంన్యూస్, పలాస)

హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా భారీ తిరంగా ర్యాలీని పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆధ్వర్యంలో గురుకుల విద్యాలయాలు, విద్యావాహిని విద్యాలయాల విద్యార్థులతో కలిసి ఈ ర్యాలీ నిర్వహించారు. జంట పట్టణాలు కేటీ రోడ్డులో ముచ్చటైన మూడు రంగుల జెండాలను పట్టుకొని, భారత్ మాతాకీ జై అంటూ వందే మాతరం నినాదాలతో ఊరంతా తిరంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలవలస వైకుంఠరావు, పట్టణ అధ్యక్షుడు వైశ్యరాజు మోహన్ రాజు, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు మహమ్మద్ ఘనీ, కంచరాన భుజంగరావు, కోమటూరి పాపారావు, టౌన్ ప్రధాన కార్యదర్శి గొంటు అప్పారావు, పొట్నూరు తారకేశ్వరరావు (చిన్ని), కృష్ణారావు, జనసేన నాయకులు కేదారినాథ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, బీజేపీ కార్యకర్తలు, అభిమానులు, రెండు విద్యాసంస్థల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.






ఇంతకుముందు బాలీవుడ్ అంటే ఖాన్‌ల కాలం. ఇప్పుడు కపూర్‌ల కాలం. అయితే బాలీవుడ్‌లో దర్శకుల కాలం ఒకటి నడిచింది. శాంతారాం, గురుదత్, రాజ్‌కపూర్.. ఆ తర్వాత కాలంలో బాసు చటర్జీ, హృషికేశ్ ముఖర్జీ, యష్‌చోప్రా.. ఇంకా నాకు తెలియని ఎంతోమంది. నటీనటులు ఎవరైనా కానీ, ఈ దర్శకుల పేరు చెప్పుకొని జనం థియేటర్లకు వచ్చేవారు. ఇప్పటికీ కొందరి పేరిట ఆ అభిమానం కొనసాగుతూ ఉంది. బాసు చటర్జీ గురించి చెప్పాలి. ఆయన్ని బాలీవుడ్ కె.బాలచందర్ అనొచ్చు. జిగేలుమనే తారలు, పెద్ద పెద్ద సెట్టింగ్‌లతో మెరిసిపోతున్న హిందీ సినిమాల మధ్య మధ్యతరగతి జీవితాన్ని ప్రభావవంతంగా చూపించిన ఘనత ఆయనది. రాజస్థాన్‌లో పుట్టిన బెంగాలీ బాబు ఆయన. 1969తో మొదలుపెట్టి, 2011 దాకా సినిమాలు తీస్తూ ఉన్నారు. బాలీవుడ్‌లో నేటికీ చెప్పుకునే 'రజనీగంధా', 'చిత్‌చోర్', 'చోటీ సి బాత్', 'కట్టా మీటా', 'మంజిల్' లాంటి సినిమాలు, వీటికి అతి భిన్నమైన 'ఏక్ రుకా హువా ఫైసలా'.. అన్నీ ఆయన తీసినవే. ఆయన రెండో సినిమా 'పియా కా ఘర్'(1972). నాతోసహా చాలామందికి ఫేవరేట్. మరాఠీ సినిమా 'ముంబయిచా జవయ్' ఈ సినిమాకు మూలం. జయబాధురి, అనిల్ ధావన్ ప్రధాన పాత్రధారులు. - వంశీ (వి.సాయివంశీ)

ముంబయి మహానగరంలో ఇరుకైన అద్దె ఇంట్లో భర్తతో జీవనం సాగించలేని కొత్త కోడలి కథ అది. ఎంతమంది ఊహించగలరు ఆ అంశం? ఎంతమందికి అర్థమవుతుంది ఆ విషాదం? అరే.. కొత్తగా పెళ్లయిన వాళ్లకు కాసింత జాగా ఇస్తే సరిపోతుందా? ఇంట్లో అడ్డంగా ఓ పరదా కట్టి అది మీ గది, ఇది మా గది అంటే చెల్లుతుందా? మనసు విప్పి మాట్లాడేందుకు భూగోళమంత, ఆకాశమంత స్థలం కావాలి వాళ్లకి. కానీ ఎలా? మహానగరంలో సాధ్యమేనా? మధ్యతరగతి మనుషులు అందుకోగలిగేదేనా? ఏ మహానగరమైనా అదేగా పరిస్థితి. ఉమ్మడి కుటుంబాలు గొప్పవంటూ ప్రసంగాలిచ్చే వారికి ఈ సమస్యను ఎలా విప్పిచెప్పడం? ట్రిపుల్ బెడ్రూం ఫ్లాట్లలో గదికొకరు చొప్పున గురక పెట్టి నిదురించేవారికి ఎలా అర్థం చేయించడం?

# ఈ దేశపు ఇరుకు గృహాల లోపల ఏముందో తెలుసా?




'పియాకా ఘర్' కాదు కానీ, తెలుగులో కూడా ఆ ఛాయలు తీసుకొచ్చిన సినిమా ఒకటి ఉంది. పేరు 'సగటు మనిషి'. 1988లో ముత్యాల సుబ్బయ్య దర్శకత్వంలో వచ్చిన సినిమా. చంద్రమోహన్, సీత ప్రధాన పాత్రధారులు. సినిమా పేరులోనే కథ అర్థమైపోతుంది. మునిసిపాలిటీలో గుమాస్తా ఉద్యోగం చేసే చంద్రమోహన్‌కు ఇద్దరు చెల్లెళ్లు. ఒక చెల్లెలు పెళ్లి చేశాడు. మరో చెల్లి పెళ్లికి ఉంది. అతనికి పెళ్లయింది. చిన్న ఇల్లు. ఒకటే గది. గుమాస్తా జీతానికి అంతకంటే పెద్ద ఇల్లు దొరికేదెలా? మరి కొత్త పెళ్లికొడుకు, పెళ్లికూతురు కలిసేదెలా? సంసార జీవితం గడిపేదెలా?

అందుకే చంద్రమోహన్ తల్లి నిర్మలమ్మ ఓ ఉపాయం ఆలోచిస్తుంది. గుళ్లో హరికథ అంటూ ప్రతి రాత్రీ చిన్న కూతుర్ని తీసుకుని బయటకు వెళ్తుంది. ఆ దంపతులకు ఏకాంతం అందించడం కోసం ఆ ఏర్పాటు. కూతురికిదంతా అర్థం కాదు. అర్థమయ్యే వయసూ లేదు. విసుక్కుంటున్న కూతురికి ఇదీ సంగతి అని ఆ తల్లి చెప్పలేదు. అందుకే ఓ రోజు హరికథ, ఇంకోరోజు బుర్రకథ అంటూ గుళ్లకు తిప్పుతుంది. అక్కడ ఏ కథా ఉండదు. కానీ గుడికొచ్చాక కొంతసేపు కూర్చోవాలంటూ కూతుర్ని కూర్చోబెట్టి ఆ రాత్రంతా అక్కడే గడుపుతుంది. సగటు మనిషి జీవితంలో అవన్నీ తప్పవు.

సినిమాలే కాదు, తెలుగు సాహిత్యం కూడా ఈ పరిణామాన్ని చాలా అరుదుగా పట్టుకుంది. మధురాంతకం నరేంద్ర రాసిన 'చోటు' అనే బీభత్సమైన కథ ఇందుకు ఉదాహరణ. మద్రాసు నగరానికి పనికోసం వెళ్లిన రాయలసీమ యువకుడు మద్దులేటి. అక్కడ ఓ చిన్న గదిలో ముడుచుకొని పడుకునే ఇద్దర్ని చూసి అతనికి ఆశ్చర్యం. ఆ గది పక్కనే శ్మశానం. చితిమంటల వెలుగు. కట్టెలు కాలుతున్న శబ్దాలు. గది నిండా కిరోసిన్ వాసన. 'శ్మశానం పక్కనే గది ఎందుకు తీసుకున్నావ్?' అని అడిగాడు. నవ్వేసిన ఆ ఫ్రెండు 'అవన్నీ అనుకుంటే ఇక్కడ ఉండలేం. పైగా పక్కనే శ్మశానం అని అద్దె తక్కువ పడింది' అన్నాడు. పక్క రూములో ఓ కుటుంబం. నలుగురు పడుకునేందుకు అందులో చోటు చాలదు. అందుకే ముసలాయన్ని బాత్రూంలో పడుకోబెట్టారు. బాత్రూంలో మనిషి పడుకోవడమా? మద్దులేటి గుండెల్లో కలుక్కుమంది. మరి అగ్గిపెట్టెలాంటి ఆ ఇంట్లో వంటే చేసుకోవాలా? సామాన్లే దాచుకోవాలా? మనుషులే ఉండాలా? అందుకే ఈ ఏర్పాటు. బాత్రూంలోనే ఆయన పడక. దానికి కప్పు లేదు. వానొస్తే ఆ ముసలాయన పాలిథిన్ కవర్ కప్పుకొని వణికిపోతూ గడపాలి. ఎట్లా? ఎట్లాంటి జీవితాలు ఇవి? ఎవరి దృష్టిలో నిలిచే బాధలివి? ఈ దేశపు ఇరుకు గృహాల లోపల ఏముందో ఎప్పుడైనా ఆలోచించామా? విశాలమైన మైదానాలు చుట్టేస్తున్న మనం ఆ ఇరుకు ద్వారాల అవతల ఎంత మథనం జరుగుతుందో గమనించామా? కర్నూల్లో ఉన్నప్పుడు అర్ధరాత్రులు ఇంటికి వస్తుంటే కొంతమంది ముస్లిం, యానాదుల పిల్లలు ఎదురయ్యేవారు. నిండా 15, 16 ఏళ్లు ఉండేవి. సైకిల్లో, స్కూటీలో వేసుకుని తిరిగేవారు. మొదట్లో చిరాకేసేది. కానీ వాస్తవం అర్థమయ్యాక జాలేసింది. ఇళ్లల్లో చోటు లేక,




ఉన్న చోటు చాలక, అక్కాబావలు, అన్నావదినలు ఉన్న కుటుంబాల్లో వాళ్లకు ఏకాంతం అందించడం కోసం కొందరు రాత్రిళ్లు ఇలా బయటకు వస్తారని తెలిసి ఆశ్చర్యపోయాను. ఇలా కూడా ఉంటుందా అని భయపడ్డాను. ఇలా తిరిగేవాళ్లను దొంగలంటూ ముద్రేసి కొన్నిసార్లు పోలీసులు బలవంతంగా స్టేషన్లకు ఈడ్చుకెళ్తారు. దెబ్బలు కొడతారు. చీకటి అలవాటైన పిల్లలు అందులో జరిగే వ్యాపారాలకు అలవాటు పడతారు. అవన్నీ బయటకు రావు. మనకు తెలియవు. ఎంత కాలం పోయినా 'పియా కా ఘర్'లు, 'సగటు మనిషి'లు ఇంకా సజీవంగానే ఉంటాయి. ఇవి ఇప్పుడప్పుడే తీరని సమస్యలు. ఈ దేశపు ఇళ్లల్లో ఇరుకుతనం పోయేదాకా, మనుషులు తమ కాళ్లు బార్లా చాపుకుని తృప్తిగా నిద్రపోయేదాకా పరిస్థితి ఇలాగే ఉంటుంది. తప్పదు.

# అక్కడ అలా.. ఇక్కడ ఇలా..



- హిండెన్‌బర్గ్ నివేదికపై 22న కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్త నిరసన
- తెలంగాణలో అదే అదాని పెట్టుబడులతో ముందుకు
- కాంగ్రెస్‌పాలిత రాష్ట్రాలపై రాహుల్‌కు పట్టులేనట్టేనా?







భారత ప్రభుత్వం తరఫున ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సెక్యూరిటీస్, కమోడిటీస్‌లను ప్రమత్తంగా నిర్వహించే సంస్థ చైర్మన్ మాధవి పురి బుచ్ కొంతకాలం కిందట అదానీ గ్రూపులో పెట్టుబడులు పెట్టారని హిండెన్‌బర్గ్ నివేదిక ఒక వార్తను లీక్ చేసింది. మాధవి భర్త ధవల్ బుచ్ అదానీకి చెందిన విదేశీ గ్రూపుసంస్థల్లో మదుపులు పెట్టారని హిండెన్‌బర్గ్ అనుమానించింది. అయితే దీని ప్రభావంతో షేర్ మార్కెట్ అల్లకల్లోలం అయ్యుండేదే. కాని, వార్తల్లో అదానీ కూడా ఉండడంతో మార్కెట్ ఎలాంటి ఒడిదొడుకులకు లోనుకాకుండా భారత ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్టే కనిపించింది. ఇది చాలా ప్రమాదకరమైన ఆట. షేర్ మార్కెట్ బబుల్ బద్దలయితే ఏమవుతుందో వివిధ దేశాల్లోనూ, పలుమార్లు మనదేశంలోనూ మనం చూశాం.

నిన్న మంగళవారం తెలంగాణ రాష్ట్రంలో జరిగిన ఒక ప్రెస్‌మీట్ చాలా ఆసక్తికరమైనది. భారత రాష్ట్ర సమితి నాయకుడు కల్వకుంట్ల తారక రామారావు (కెటిఆర్) ఏర్పాటుచేసిన ఈ పాత్రికేయ సమావేశం తెలంగాణ సమాజాన్ని తీవ్ర ఆలోచనలో పడేసింది. కాంగ్రెస్ పార్టీ దేశంలో ఒక మాదిరి, తెలంగాణలో మరో మాదిరి ఆలోచిస్తున్నదని, ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నదని ఆయన రేవంత్ రెడ్డి సర్కారును దుూదేకిపారేశారు. అసలే తెలంగాణ కాంగ్రెస్ పార్టీపై కోపంతో ఉన్న కెటిఆర్ అవకాశం చిక్కినపుడు వినియోగించుకోకుండా ఉంటారా? ఒకవైపు బిఆర్ఎస్ శాసనసభ సభ్యులను ఒక్కరొక్కరిగా కాంగ్రెస్ పార్టీలోకి తీసుకోవడంతో బిఆర్ఎస్ అధినాయకత్వం గుర్రుగా ఉంది.

భారత ప్రభుత్వం తరఫున ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సెక్యూరిటీస్, కమోడిటీస్‌లను ప్రమత్తంగా నిర్వహించే సంస్థ చైర్మన్ మాధవి పురి బుచ్ కొంతకాలం కిందట అదానీ గ్రూపులో పెట్టుబడులు పెట్టారని హిండెన్‌బర్గ్ నివేదిక ఒక వార్తను లీక్ చేసింది. మాధవి భర్త ధవల్ బుచ్ అదానీకి చెందిన విదేశీ గ్రూపుసంస్థల్లో మదుపులు పెట్టారని హిండెన్‌బర్గ్ అనుమానించింది. అయితే దీని ప్రభావంతో షేర్ మార్కెట్ అల్లకల్లోలం అయ్యుండేదే. కాని, వార్తల్లో అదానీ కూడా ఉండడంతో మార్కెట్ ఎలాంటి ఒడిదొడుకులకు లోనుకాకుండా భారత ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్టే కనిపించింది. ఇది చాలా ప్రమాదకరమైన ఆట. షేర్ మార్కెట్ బబుల్ బద్దలయితే ఏమవుతుందో వివిధ దేశాల్లోనూ, పలుమార్లు మనదేశంలోనూ మనం చూశాం. స్టాక్‌మార్కెట్ కుప్పకూలితే అందులో పెట్టుబడులు పెట్టిన మధ్యతరగతి ప్రజలు తీవ్రమైన ఆర్థిక నష్టాలకు గురవుతారు. దేశ ఆర్థికవ్యవస్థ అతలాకుతలం అవుతుంది. ఇందులో ఉన్న సీరియస్‌నెస్‌ను గుర్తించిన కాంగ్రెస్ పార్టీ వెంటనే దేశ ప్రజలకు ఉన్న అనుమానాలను తీర్చాలని కోరుతూ ఒకవైపు సుప్రీంకోర్టులో సమగ్ర దర్యాప్తు కోసం పిటిషన్ వేసింది. మరోవైపు ఈ నెల 22న దేశవ్యాప్త ఆందోళనలకు పిలుపునిచ్చింది. దీనికి ధీటుగా పాలక పక్షం కూడా సమాధానమిచ్చింది. దేశంలో తీవ్ర ఆర్థిక అస్థిరతను నెలకొల్పడానికి ప్రతిపక్షం ఇలాంటి కుట్రలు పన్నుతోందని భారతీయ జనతా పార్టీ విమర్శించింది. ఇండియా పార్టీలు మాత్రం తక్షణమే సెబీ చైర్మన్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తున్నాయి. సరిగ్గా ఈ సందర్భాన్ని వాడుకోవడానికా అన్నట్టు కెటిఆర్ పత్రికా విలేకరుల సమావేశం ఏర్పాటుచేసారు. కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్త నిరసనలకు పిలుపునివ్వడాన్ని స్వాగతిస్తూనే ఆ పార్టీ పాటిస్తున్న ద్వంద్వ ప్రమాణాలను ఎండగట్టారు. ఒకవేళ అదానీ భారతదేశానికి సరికాకపోతే, అదే వ్యక్తి ఇచ్చిన పెట్టుబడులు తెలంగాణకు ఎలా ఆమోదయోగ్యమవుతాయని తీవ్రంగా ప్రశ్నించారు.

### అడకత్తెరలో ఇరుక్కున్న రేవంత్

ఈ ఏడాది జనవరిలో జరిగిన ఒక ఒప్పందంలో అదానీ గ్రూపు తెలంగాణ ప్రభుత్వంతో నాలుగు ఒప్పందాలు చేసుకుంది. విభిన్న రంగాలలో 12,400 కోట్ల రూపాయలను పెట్టుబడులు పెట్టడానికి అంగీకరించింది. దేశంలో అదానీ వ్యాపార విస్తరణను తీవ్రంగా నిరసిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, దాని అధినేత రాహుల్ గాంధీ.. అందులో భాగంగా తెలంగాణలో అదానీ ఒప్పందాలను వెనక్కి తీసుకోగలుగుతారా అని కెటిఆర్ విమర్శించారు. తెలంగాణ భవిష్యత్తు కోసం బిఆర్ఎస్ ఎప్పుడూ చెక్కుచెదరని సంకల్పంతో ఉంటుందని, అలాంటి పట్టుదల కాంగ్రెస్ ప్రభుత్వం ప్రదర్శించగలదా అని ప్రశ్నించారు. కాగా రేవంత్ రెడ్డి తన పదిహేను రోజుల విదేశీ పర్యటన ముగించుకుని వచ్చారు. ఈ ఏడాది జనవరిలో దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకానమిక్ ఫోరమ్ సదస్సుకు హాజరైనప్పుడు వచ్చినంత మీడియా హైప్, కవరేజి ఈసారి జరిపిన విదేశీ పర్యటనకు ఎందుకో గాని రాలేదు. దావోస్ సమ్మిట్‌లో నలభై వేల కోట్ల రూపాయల పెట్టుబడులు చెరువులో చేపలు పట్టినట్టు రేవంత్ పట్టుకొచ్చేసారని గప్పాలు కొట్టిన తెలంగాణ పత్రికలు, ఈసారి విదేశీ పెట్టుబడిదారులు డబ్బులు కుమ్మరించేసారని ఎందుకో గాని పెద్దగా రాయలేదు. తెలంగాణ ముఖ్యమంత్రి జరిపిన ఈ విదేశీ పర్యటన పట్ల మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది.

బిఆర్ఎస్ హయాంలో ముఖ్యమంత్రి కెసిఆర్ ఒక విధంగా పని విభజన చేశారు. వ్యవసాయం, సంక్షేమం వంటి కార్యక్రమాలు తాను పర్యవేక్షిస్తూ, ఐటి పరిశ్రమలు, పెట్టుబడుల ఆకర్షణ వంటి కార్యకలాపాలు తనయుడు కెటిఆర్‌ను పర్యవేక్షించమనేవారు. నీటి పారుదల బాధ్యతలను మేనల్లుడు హరీశ్‌రావుకు, విద్యుత్ రంగాన్ని జగదీశ్ రెడ్డి, ఇలా తాను ఎంపిక చేసిన కొంతమందికి వివిధ బాధ్యతలు అప్పజెప్పారు. అయితే రేవంత్ వద్ద ప్రస్తుతం అలాంటి యంత్రాంగం గాని, మంత్రాంగం గాని లేవు. నిజానికి జనవరిలో జరిగిన దావోస్ సమావేశానికి చివరి క్షణం వరకూ ఆ రాష్ట్ర ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెళ్తారని అనుకున్నారు. చివరి క్షణంలో వారివెంట ముఖ్యమంత్రి కూడా బయల్దేరారు. ఈసారి పదిహేను రోజుల అమెరికా పర్యటనలో మాత్రం మునుపటి జోష్ కనిపించలేదు. పైగా పర్యటనలో జరిగిన చాలా ఒప్పందాలు వివాదాస్పదంగా మారాయి. వెయ్యికోట్ల రూపాయల ఒప్పందం జరుపుకున్న ఒక కంపెనీ స్వయంగా ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులదని అక్కడి ఎన్నారైలు సాక్ష్యాలు చూపించారు.

### ఎన్నారైల చొరవతో చీకటి ఒప్పందాలు వెలుగులోకి!

వివిధ సంస్థలతో ఎలాంటి ఒప్పందాలు జరిగాయో, నిధులు ఎంతవరకు సమీకరించారో పూర్తి వివరాలు తెలంగాణ ప్రభుత్వం ఇంకా వెల్లడించలేదు గాని, అమెరికాలో ఉంటున్న ప్రవాస తెలంగాణ విద్యాధికులు మాత్రం రాహుల్‌గాంధీకి ఒక బహిరంగ లేఖ రాశారు. ఇందులో గడచిన పదిహేను రోజుల్లో తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన వాణిజ్య ఒప్పందాలు భవిష్యత్తులో తలనొప్పులు తెచ్చిపెట్టగలవని హెచ్చరించారు. పనిలోపనిగా ఐటి శాఖామాత్యులు శ్రీధర్‌బాబుకు కూడా ఎన్నారైలు అక్కడ జరిగిన ఒప్పందాల మీద బోల్డన్ని అనుమానాలు వ్యక్తం చేస్తూ, వీటన్నింటికి వీలైనంత దూరంలో ఆయన ఉండడమే శ్రేయస్కరమని హితవు పలికారు. ముఖ్యమంత్రి వెళ్లిన ప్రైవేట్ జెట్‌లో అనధికార వ్యక్తులు విహారం చేసిన ఫోటోలు ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో వైరల్ అవుతున్నాయి. ప్రత్యేకంగా రేవంత్ రెడ్డి తమ్ముడు ఎనుముల తిరుపతి రెడ్డి అనేక ఒప్పందాల చిత్రాలలో కనిపించడం ఆ రాష్ట్రంలో హాట్ టాపిక్‌గా మారింది. తమ్ముడిని రాజ్యాంగేతర శక్తిగా తయారుచేస్తున్నాడని సొంత పార్టీలోని రేవంత్ రెడ్డి వ్యతిరేక వర్గం దుమ్మెత్తిపోస్తోంది.

మోదీ వ్యతిరేక పోరాటంలో ప్రస్తుతం తలమునకలుగా ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రధాన పర్యవేక్షకుడు రాహుల్ గాంధీ తెలంగాణలో ఏం జరుగుతుందో పట్టించుకునే పరిస్థితుల్లో లేరు. దాంతో రేవంత్ రెడ్డికి పార్టీ హైకమాండ్ నుంచి ఎలాంటి అదిలింపులు బెదిరింపులు చేరినట్టు ప్రస్తుతానికి కనిపించడం లేదు.

- దుప్పల రవికుమార్

# నగరం చుట్టూ ఓఆర్ఆర్

- ఏడాదిలో పనులు మొదలుపెట్టాలి
- నాగావళి తీరంలో పర్యాటకానికి ప్రాధాన్యం
- కొవ్వాడ సమస్యలను పరిష్కరించాలి
- ముఖ్య శాఖల సమీక్షలో మంత్రి అచ్చెన్నాయుడు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం నగరంచుట్టూ ప్రతిపాదిత ఓఆర్ఆర్ (అవుటర్ రింగ్ రోడ్డు) నిర్మాణానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ఏడాదిలో పనులు మొదలు పెట్టేలా ప్రణాళికలు రూపొందించాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్, దేవదాయ, గనులు భూగర్భ, కొవ్వాడ తదితర ముఖ్య శాఖల జిల్లా ఉన్నతాధికారులతో మంగళవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా కేంద్రం చుట్టూ 36 కిలోమీటర్ల పొడవునా 200 అడుగుల వెడల్పుతో 18 గ్రామాలను కలుపుతూ ఓఆర్ఆర్ నిర్మాణం చేపడతామని, ఇందు కోసం 542 ఎకరాల భూ సేకరణ చేయాల్సి ఉందన్నారు. ప్రాజెక్టుకు అన్ని అనుమతులు తీసుకుని ప్రజాభిప్రాయ సేకరణ చేసి ముందుకు వెళ్లాలని సూచించారు. శ్రీకాకుళం కార్పొరేషన్‌కు ప్రస్తుతం ఉన్న కార్యాలయ భవనం స్థానంలో కమర్షియల్ కాంప్లెక్స్‌తో కూడిన నూతన కార్యాలయాన్ని నిర్మించాలని చెప్పారు. డే నైట్ కూడలి నుంచి 7 రోడ్ల కూడలి వరకూ రోడ్డు మధ్యలో ఉన్న మొక్కలను వెంటనే తొలగించి ఆహ్లాదాన్ని ఇచ్చే మొక్కలను నాటాలని, అలాగే సబ్ సర్ఫేస్ డైక్ నుంచి రెల్లివీధి వరకూ నాగావళి నదికి కరకట్ట నిర్మాణం యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. నగరంలో నీరు నిలిచిపోకుండా వెంటనే 7.5 కి.మీ మేర మిర్తిబట్టి, సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ పనులకు నిధులు అందుబాటులో ఉన్నాయని, పనులు వెంటనే మొదలు పెట్టాలని ఆదేశించారు. డే నైట్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకూ 80 అడుగుల వరకూ రోడ్డు విస్తరించాలని, బలగ వరకూ విస్తరణ పనుల్లో నష్టపోయిన వారికి టీడీఆర్‌లు ఇవ్వాలని సూచించారు. పాత్రునివలస, పెద్దపాడుల్లో మంచినీటి సరఫరా పనులకు రూ.24 కోట్లతో పనులు మొదలుపెట్టాల్సి ఉందన్నారు. అరసవిల్లి దేవస్థానానికి వచ్చే భక్తుల సౌలభ్యం కోసం ఇంద్ర పుష్కరిణి వెనక నుంచి కొత్త మార్గాన్ని ప్రతిపాదించాలని ఆదేశించారు. దేవాలయ ఆధీనంలో ఉన్న దుకాణాలకు వేలంపాట నిర్వహించాలని, అనధికార ఉద్యోగాలు చేస్తున్న 48 మందిని వెంటనే విధుల నుంచి తొలగించాలని స్పష్టం చేశారు. ఇసుకపై ప్రభుత్వం నూతన పాలసీ ప్రకటించే వరకూ అక్రమ ఇసుక అనే మాటే రాకూడదని గనులు భూ గర్భ శాఖ అధికారులను హెచ్చరించారు. అక్రమ క్వారీలు, అక్రమ ఇసుక రాంపులపై ప్రతిరోజూ దాడులు చేయాలని, రాత్రి వేళల్లో విశాఖ వెళ్లే అక్రమ ఇసుక లారీలను సీజ్ చేయాలని ఆదేశించారు. కొవ్వాడ అణు విద్యుత్ కేంద్రానికి సంబంధించి స్థానికుల అభ్యంతరాలను పరిగణలోకి తీసుకొని సత్వరమే ఆయా సమస్యలను పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు. నగరంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంలో చొరవ తీసుకోవాలని, వాహనాల పార్కింగ్ విషయంలో ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని అడిషనల్ ఎస్పీ ప్రేమ కాజల్‌ను ఆదేశించారు. సమీక్షలో జేసీ ఫర్మాన్ అహ్మద్, శ్రీకాకుళం, ఎచ్చెర్ల ఎమ్మెల్యేలు గొండు శంకర్, ఎన్.ఈశ్వరరావు, ఆర్డీవో సిహెచ్ రంగయ్య, మున్సిపల్ ఇంజనీరింగ్ ఈఈ సుగుణాకర రావు, అరసవెల్లి డిప్యూటీ కమిషనర్ ఎస్.చంద్రశేఖర్, కొవ్వాడ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీనారాయణ, గనులు భూగర్భ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.సత్యనారాయణ తదితరులు హాజరయ్యారు.

## ఇండిపెండెన్స్‌డే వేడుకలకు ముందస్తు ఏర్పాట్లు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లాలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఆర్ట్స్ కళాశాల ప్రాంగణం ముస్తాబౌతుంది. ముందస్తు ఏర్పాట్లుగా పోలీసులు మాక్ డ్రిల్ నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని, ఎస్పీ ఆదేశాల మేరకు పూర్తిస్థాయిలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఏఆర్ డీఎస్పీ శేషాద్రి తెలిపారు. జిల్లా పోలీసు యంత్రాంగమంతా స్టేడియంలో పనుల్లో నిమగ్నమయ్యారని, ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణంలో సర్వాంగ సుందరంగా వేడుకలు జరిపేందుకు కలిసికట్టుగా కృషి చేస్తున్నారని, జిల్లా వ్యాప్తంగా అన్ని శాఖలు శకటాలు, ఎగ్జిబిషన్, జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసినట్లు వివరించారు.



## పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

- రణస్థలం, మురపాక, ఎచ్చెర్ల కేజీబీవీలు ఆకస్మిక తనిఖీ -



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికారి సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయాధికార సంస్థ ఆదేశాల మేరకు సీనియర్ సివిల్ జడ్జి కార్యదర్శి, జిల్లా న్యాయాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు ఎచ్చెర్ల, రణస్థలం, మురపాకల్లోని కేజీబీవీలను సందర్శించారు. వాటి నిర్వహణపై ఆరా తీశారు. కేజీబీవీలో తరగతి గదులు, డైనింగ్ హాల్, వంటగది పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలడానికి ప్రధాన కారణం పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడమని అన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే ఎటువంటి అనారోగ్య సమస్యలు రావని, కేజీబీవీ నిర్వాహకులు కేంద్రాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం వారికి చట్టాల పట్ల అవగాహన కల్పిస్తూ పరిష్కార మార్గాలు వివరించారు.

## విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం



(సత్యంన్యూస్, టెక్కలి)

దండుగోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టెన్త్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి 2023-24 విద్యా సంవత్సరంలో మొదటి మూడు స్థానాల్లో అత్యధిక మార్కులు సంపాదించిన విద్యార్థులకు నగదు బహుమతితో పాటు జ్ఞాపికలను, ప్రశంస పత్రాలను కోత మహాలక్ష్మి అప్పన్న మెరియల్ సర్వీసు ఆర్గనైజేషన్ అందజేసింది. 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు అప్పిని కీర్తనకు రూ.7వేలు, అలజంగి షణ్ముఖప్రియకు రూ.5వేలు, రిక్కా డింపుల్‌కు రూ.4వేలు నగదు బహుమతి అందించారు. అలాగే బాలికలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కింజరాపు సాత్విక, లమ్మత భువనకృతి, ఇచ్ఛాపురం పావనిలకు ఒక్కొక్కరికి రూ.3వేలు నగదుతో పాటు లమ్మత నారాయణమ్మ చిన్నయ్య స్మారక అవార్డు, ప్రశంసా పత్రాలు, ఇంగ్లీష్, గ్రూపు సబ్జెక్టుల్లో ఎక్కువ మార్కులు పొందిన కకుష్ట సృజనకు రూ.4వేలు, పిల్లల శ్యామలకు రూ.3వేలు, బెవర గాయత్రికి రూ.3వేలు నగదుతో పాటు కోత అబ్బాయి సావిత్రమ్మ స్మారక అవార్డు ప్రశంసాపత్రాలు అందించారు. అలాగే అసోం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కోత రవి ట్రిపుల్ ఐటీకి ఎంపికైన నలుగురు విద్యార్థులు కీర్తన, షణ్ముఖప్రియ, సాత్విక, భూమికలకు ఒక్కొక్కరికి రూ.5వేలు చొప్పున నగదు బహుమతిని, జ్ఞాపికలను రిటైర్డ్ వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ మార్పు అమ్మాజీరావు, సంస్థ అధ్యక్షులు కోత మధు, చినబాబు, ధర్మారావు, వడ్డితాండ్ర, కోటపాడు, దండుగోపాలపురం సర్పంచులు అశోక్, తిరుపతిరావు, సతీష్, అప్పలస్వామి, అప్పలరాజు, వసంతరావు, పొందల రామకృష్ణ, హన్నురావు, ఎస్ఎంసీ అధ్యక్షులు భారతి, బాలరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోత చైతన్య చేతుల మీదుగా విద్యార్థులకు అందచేసారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన కలిగివుండాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్)




చట్టాలు, ట్రాఫిక్ నిబంధనల గురించి ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉండాలని శ్రీకాకుళం రూరల్ సీఐ కె.పైడపునాయుడు విద్యార్థులకు సూచించారు. విద్యార్థులకు ర్యాగింగ్, సైబర్ మోసాలు, మహిళ రక్షణ, భద్రత, ట్రాఫిక్ నియమాలు, హెల్మెట్‌ధారణ, మైనర్ డ్రైవింగ్, మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు పట్ల అవగాహన కల్పించాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం శ్రీకాకుళం రూరల్ సీఐ నైరా ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ కళాశాల విద్యార్థినులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాదకద్రవ్యాలతో యువత మత్తుకు బానిసై విలువైన జీవితాన్ని కోల్పోవద్దని, చెడు వ్యసనాలకు బానిస కాకుండా చదువుపై ప్రత్యేక దృష్టి సారించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల అవగాహన అవసరమని విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ వాసునారాయణ, కె.వెంకటేష్, మహిళా ఎస్ఐ రేవతి, కళాశాల అధ్యపకులు ఉన్నారు. అలాగే గార పోలీస్ స్టేషన్ ఎస్ఐ తన పరిధిలో ఉన్న వమరవల్లి డైట్ కళాశాల విద్యార్థినులతో ర్యాగింగ్, సైబర్ నేరాలు, హెల్మెట్‌ధారణ, మైనర్ డ్రైవింగ్, మత్తు పదార్థాల వినియోగం, రవాణా తదితర అంశాలు యువతీ యువకులు అవగాహన అవసరమని తెలిపారు.

# నిబంధనల ఫీట్లు.. పెన్షనర్ల పాట్లు!

(మొదటిపేజీ తరువాయి)

కొత్త ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

**లబ్ధిదారుల సంఖ్యలో హెచ్చుతగ్గులు**

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం జూలై నుంచి పింఛన్లు పెంచడం తోపాటు అంతకుముందు మూడు నెలల ఎరియర్స్ కూడా అందించింది. అయితే జూలైలో పింఛన్ అందుకోలేనివారికి ఎరియర్స్ ఇవ్వలేదు. ఇలా ప్రతినెలా పలువురు లబ్ధిదారులు పింఛన్లు తీసుకోలేని పరిస్థితి ఉంది. ఈ కారణంగానే ప్రతి నెలా లబ్ధిదారుల సంఖ్యలో హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయని సెర్ప్ అధికారులు చెబుతున్నారు. అలాగే లబ్ధిదారుల్లో సగటున ప్రతినెలా 1100 మంది మరణిస్తున్నారని అంచనా. పింఛన్ల మొత్తం పెంచారు బాగానే ఉంది. కొత్త పింఛన్లు ఎప్పుడు మంజూరు చేస్తారోనని అర్హులు ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన మార్చి నుంచి కొత్త దరఖాస్తుల ప్రక్రియ నిలిచిపోయింది. మే నాటికి శ్రీకాకుళం జిల్లాలో 16 కేటగిరీలకు చెందిన 3,20,886 మంది లబ్ధిదారులకు రూ.93.67 కోట్లు విడుదల చేశారు. అదే జూన్‌లో 3,19,702 మంది లబ్ధిదారులకు రూ.93.30 కోట్లు ఇచ్చారు. పింఛన్ మొత్తాల పెంపు అమలు చేసిన జూలైలో 3,19,119 మందికి రూ.118.39 కోట్లు విడుదల చేశారు. ఈ నెలలో 3,18,017 మంది లబ్ధిదారులకు రూ.129.78 కోట్లు చెల్లించారు. ఇందులో 3,15,121 మందే పింఛన్లు అందుకున్నారు. మిగతా 2896 మందిలో 1139 మంది మృతిచెందగా 25 మంది ఇళ్లకు తాళాలు వేసి ఉన్నట్లు గుర్తించారు. 45 మంది ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. 704 మంది ఇతర ప్రాంతాలకు వెళ్లిపోగా 987 మందిని తాత్కాలిక వలసదారులుగా అధికారులు గుర్తించారు. అదే మే నెలలో 3,20,886 మంది లబ్ధిదారుల్లో 3,15,121 మందే పింఛన్లు అందుకోగలిగారు. ఈ విధంగా మూడు నెలల్లో మొత్తం 5,765 మంది పింఛన్లు అందుకోలేదు. వీరిలో 3200 మంది మృతి చెందినట్లు అధికారులు చెబుతున్నారు. మిగతా వారిని వలసదారులుగా చూపిస్తున్నారు.

**ఏడు నెలలుగా అభాగ్యుల ఎదురుచూపులు**

గత వైకాపా ప్రభుత్వం నవశకం పేరుతో సచివాలయాల ద్వారా లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించేది. ఏడాదికి రెండు పర్యాయాలే కొత్త పింఛన్లను మంజూరు చేసేది. జనవరి నుంచి దరఖాస్తు చేసుకున్న వారికి జూలైలో, జూలై తర్వాత దరఖాస్తు చేసుకున్న వారికి జనవరిలో కొత్త పింఛన్లు మంజూరు చేస్తూవచ్చారు. ఈ ఏడాది జనవరిలో వివిధ కేటగిరీల్లో సుమారు ఏడు వేల మంది కొత్తవారికి పింఛన్లు మంజూరు చేశారు. ఆ తర్వాత దరఖాస్తుల స్వీకరణ నిలిచిపోయింది. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఈ ప్రక్రియకు పూర్తిగా బ్రేక్ పడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలు పూర్తి అయినా కొత్త పింఛన్లకు దరఖాస్తుల స్వీకరణపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ వర్తింపజేస్తామన్న ఎన్నికల హామీపై కూటమి పెద్దలు నోరు మెదపడం లేదు. జాతీయ ఆహార భద్రతా చట్టంలో కేంద్ర ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలకు అనుగుణంగా గత వైకాపా ప్రభుత్వం పింఛన్ల మంజూరుకు కఠినమైన నిబంధనలు అమలు చేసింది. ఈ మార్గదర్శకాలను సులభతరం చేయాలని దరఖాస్తుల తిరస్కరణకు గురైన లబ్ధిదారులు కోరుతున్నారు. దీన్ని పట్టించుకోకుండా కూటమి ప్రభుత్వం మరో కొత్త నిబంధనను తెరపైకి తీసుకొచ్చింది. కొత్త రేషన్‌కార్డు జారీ చేయాలంటే వివాహ నమోదు ధ్రువపత్రం తప్పనిసరి చేసింది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో రేషన్‌కార్డులు లేని కొత్త జంటలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. జిల్లా సుమారు ఎనిమిది వేలమంది వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు పింఛన్లకు దరఖాస్తు చేసుకునే అవకాశం కోసం ఏడు నెలలుగా ఎదురుచూస్తున్నారు. వీరిలో 60ఏళ్లు దాటిన వారే ఎక్కువ మంది ఉన్నారు. రాజకీయ కారణాలతో తిరస్కరణకు గురైనవారు కూడా చాలామందే ఉన్నారు. దీనిపై కూటమి ప్రభుత్వం త్వరగా నిర్ణయం తీసుకోవాలని వారంతా కోరుతున్నారు.


శ్రీకాకుళంనగరపాలకసంస్థ

రోజా సం.1615/2015/H1/తేది:27-07-2024.

# జిల్లాలో మూడు అన్న క్యాంటీన్లు

(మొదటిపేజీ తరువాయి)

మార్పులు చేసి ఇంటర్నెట్ సౌకర్యంతో పాటు, ఒక కంప్యూటర్‌ను ఏర్పాటు చేశారు. సుమారు 70మంది ఒకేసారి భోజనం, అల్పాహారం చేసేందుకు వీలుగా స్టీల్ టేబుల్స్‌ను ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్ ద్వారా టోకెన్లు జారీ చేయడానికి నిర్ణయించారు. వీటి నిర్వహణ బాధ్యతను గతంలో మాదిరిగా రాష్ట్రవ్యాప్తంగా హరేరామ స్వచ్ఛంద సంస్థకు అప్పగించారు. గతంలో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం మాత్రమే సరఫరా చేసేవారు. ప్రస్తుతం మూడుపూటలా ఆహారం సరఫరా చేయడానికి హరేరామ సంస్థతో ఒప్పందం చేసుకున్నారు.

**మెనూ ఇలా..**

మెనూలో వారంలో ఆరు రోజులు అల్పాహారంగా ఇడ్లీతో పాటు ఆరు రోజుల్లో రెండు రోజులు పూరి, ఉప్మా, పొంగల్ అందుబాటులో ఉంచనున్నారు. * అల్పాహారంగా ఇడ్లీలు మూడు, ఉప్మా, పొంగల్ 250 గ్రాములు, చట్నీ 15 గ్రాములు, సాంబార్ 150 గ్రాములు ఇవ్వనున్నారు. * లంచ్, డిన్నర్‌లో వైట్‌రైస్-400 గ్రాములు, పప్పు 120 గ్రాములు, కూర 100 గ్రాములు, పెరుగు 75 గ్రాములు, పచ్చడి 15 గ్రాములు వడ్డించనున్నారు. * వారానికి ఒక రోజు స్పెషల్ రైస్. ఆదివారం సెలవుగా నిర్ణయించడంతో మిగతా రోజుల్లో అల్పాహారం ఉదయం 7.30 నుంచి 10 గంటల వరకు, లంచ్ మధ్యాహ్నం 12.30 నుంచి 3 గంటల వరకు, డిన్నర్ 7.30 నుంచి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుందని అధికారులు చెబుతున్నారు. కేవలం 5 రూపాయలకే వీటిని సరఫరా చేయనున్నారు. సెల్ఫ్ సర్వీస్ మోడ్‌లో వీటిని వినియోగదారులకు సరఫరా చేస్తారు. రోజూ మూడు పూటలు కలుపుకొని 1200 మందికి ఆహారం సరఫరా చేయాలని ఆలోచన చేస్తున్నారు. ధరల పట్టికతో పాటు మెనూ బోర్డును అన్నాక్యాంటీన్లలో ఏర్పాటు చేస్తున్నారు. గతంలో మొదట మూడు ఇడ్లీలు సరఫరా చేసి రద్దీ పెరగడంతో రెండు ఇడ్లీలను సరఫరా చేశారు. రద్దీ పెరిగితే మెనూలో మార్పులకు అవకాశం ఉంటుందని నిర్వాహకులు చెబుతున్నారు.

# స్కూల్ లైబ్రరీకి స్వతంత్ర దినోత్సవ కానుక



(సత్యంన్యూస్, సంతకవిటి)

బొద్దూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రంథాలయానికి మందరాడ గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ లెంక జగన్, 1989-93 వరంగల్ ఎన్ఐటి మిత్రులు పొట్టి రామకృష్ణా, పి.వి.కృష్ణారావు, చక్రి తదితరులు 78 స్వతంత్ర దినోత్సవ కానుకగా రూ.30వేలు విలువ చేసే ఇంగ్లీషు, తెలుగు పుస్తకాలు అందజేశారు. బీర్బల్, తెనాలి రామకృష్ణ, పంచతంత్రం కథలు, ఆర్.కే.నారాయణ నవలలు, కంప్యూటర్ పుస్తకాలు, మెదడుకు మేత, ఇంగ్లీషు ఫజిల్ పుస్తకాలు, జాతీయ నాయకుల జీవిత చరిత్రలు, ప్రపంచ నాయకుల పుస్తకాలను ఆంగ్ల ఉపాధ్యాయుడు అదపాక దామోదరరావు ద్వారా హెచ్ఎం మల్లేశ్వరరావు, పాఠశాల చైర్మన్ వల్లూరి చిరంజీవినాయుడులకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యనారాయణ, కృష్ణ, మంతపూడి ప్రసాద్, శ్రీరాం, భవాని, పురుషోత్తం, రమేష్ పాల్గొన్నారు.



కంపోస్ట్ కాలనీ, మంగువారితోటకు సంబంధించిన అంగన్వాడీ సెంటర్ ఎంఈ స్కూల్‌లో బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో దాస్యం రాంబాబు (నానీ), గొలివి ధనుంజయ్, గంగు రమణ తదితరులు పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం

# అజాత శత్రువు జోగినాయుడు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జర్నలిజం పవిత్రమైన వృత్తే కాదు, సామాజిక బాధ్యత కూడా అని నిరూపించిన వ్యక్తి ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టు ఫోరం రాష్ట్ర కార్యదర్శి శాసపు జోగి నాయుడు అని వక్తలు కొనియాడారు. బుధవారం ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరిగిన జోగినాయుడు జన్మదినోత్సవ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఇంటాక్ కో-కన్వీనర్ లయన్స్ క్లబ్ హర్షవల్లి శాఖ అధ్యక్షులు వావిలపల్లి జగన్నాధనాయుడు, జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర నాయుకుడు కొంక్యాన వేణుగోపాల్ మాట్లాడుతూ శత్రువులకు కూడా చేయూతనిచ్చే అజాతశత్రువు నాయుడని అన్నారు. జోగినాయుడు పుట్టినరోజు సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు కళాశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ జోనల్-3 చైర్మన్ పిజి గుప్తా, స్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షులు బీవీ రవిశంకర్ ప్రసంగించారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ గేదెల ఇందిరా ప్రసాద్, ఎన్‌సీసీ అధికారి డాక్టర్ యాల్ల పోలినాయుడు, దిశ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సోమశేఖర్, వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రతినిధులు సుగంధం సంజీవరావు, ఎం.మల్లిబాబు, శాసపు అనిల్‌కుమార్, బరాటం శ్రీనివాస్, బీజేపీ నేతలు వారాడ రాజేంద్రనాయుడు, దన్నాన మధన్ మోహన్, రోటరీ క్లబ్ ప్రతినిధి ఐకె రావు, జామి రాధాకృష్ణ, కె.కొండబాబు, గిడుతూరి శివ పాల్గొన్నారు.



# డాక్టర్ బాడానకు ప్రతిష్టాత్మక అవార్డు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని వర్చువల్ వేడుకలో ది ఫెయిర్ విజన్ ఫౌండేషన్ సంస్థ నుంచి సర్టిఫికేట్ ఆఫ్ అచీవ్‌మెంట్ స్వతంత్ర నాయక్ సమ్మాన్ అవార్డు లభించిందని, అవార్డు గ్రహీత డాక్టర్ బాడాన దేవభూషణరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిష్టాత్మక అవార్డు రావటం, అందులోనూ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రావటం అదృష్టంగా భావిస్తున్నానని, అవార్డు మరింత బాధ్యతను పెంచిందన్నారు. ఈ సందర్భంగా నగరంలోని పలువురు ప్రముఖులు, దేవభూషణరావుకు అభినందనలు తెలిపారు.

# పోలీసు పరేడ్ ఉత్సాహంగా నిర్వహించాలి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

ఆర్ట్స్ కళాశాల మైదానంలో గురువారం జరగనున్న 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పోలీసు పరేడ్ ప్రత్యేక ఆకర్షణగా నిలవాలని ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి పోలీస్ సాయుధ బలగాలకు సూచించారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల కోసం ఆర్ట్స్ కళాశాల మైదానంలో పోలీసు పరేడ్ సాధన నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఎస్పీ బుధవారం ఉదయం ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ సిబ్బంది, పోలీసు బ్యాండ్ సిబ్బంది, స్కౌట్స్ విద్యార్థులతో చేసిన పరేడ్ సాధన కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఏఆర్ డీఎస్పీ ఎల్.శేషాద్రి పెరేడ్ కమాండర్‌గా వ్యవహరిస్తూ పోలీస్ కవాతు సాధన నిర్వహించారు. ముందుగా సిబ్బంది నుంచి ఎస్పీ గౌరవ వందనం స్వీకరించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కవాతు పరిశీలన వాహనంలో వెళ్లి సాయుధ పోలీసు బలగాల పరేడ్ ప్రదర్శన పరిశీలించి పరేడ్ నిర్వహణలో భాగంగా కొన్ని సూచనలు చేశారు. పంద్రాగస్టు వేడుకల్లో జాతీయ సమైక్యత, దేశభక్తి, జాతీయ భావం వెల్లివిరిసేలా సాధన చేయాలని ఎస్పీ పేర్కొన్నారు. మైదానంలో వాహనాల పార్కింగ్, ట్రాఫిక్, భద్రత బందోబస్తుపై అధికారులతో చర్చించారు. ఈ సాధనలో అదనపు ఎస్పీ డాక్టర్ జి.ప్రేమ్‌కాజల్, డిఎస్పీ ఎల్.శేషాద్రి, ఆర్ఐ కె.నర్సింగరావు, ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# వికలాంగునికి చక్రాల కుర్చీ అందజేత

(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

ఫాజుల్‌బాగ్‌పేటకు చెందిన జి.రాజు, గౌరీల కుమారుడు షణ్ముఖ శ్రీనివాస్ చూడటానికి బాలునిగా కనిపిస్తున్నా, ఆయన వయసు 15 సంవత్సరాలు. చిన్న నాటి నుంచి వింత వ్యాధితో బాధపడుతూ, రెండు కళ్లు సరిగా కనపడవు. రెండు కాళ్లు చచ్చుబడి మంచానికే పరిమితమయ్యాడు. బాలుని దీనస్థితిని గమనించిన చౌదరి సత్యనారాయణ కాలనీకి చెందిన కరగాన రాణి ద్వారా విషయం తెలుసుకున్న నంది ఉమాశంకర్ స్పందించి ఎచ్చెర్ల మండలం ధర్మవరానికి చెందిన రుప్ప సోమేశ్వరరావు అందించిన సహకారంతో ఆ బాలునికి మూడు చక్రాల కుర్చీని బుధవారం అందించారు. అలాగే తన రెండు కళ్లను స్థానిక శంకర్ ఫౌండేషన్ వైద్యులు సుదీర్‌కుమార్‌కు చూపించగా, పరీక్షించిన ఆయన నరాలు బలహీనత వల్ల చూపు రావటం కష్టతరమని తెలిపారు. ఈ సందర్భంగా సహాయం చేసిన రుప్ప సోమేశ్వరరావుకు, కరగాన రాణి, ఎమర్జెన్సీ బ్లడ్ సర్వీస్ నంది ఉమాశంకర్‌కు షణ్ముఖ శ్రీనివాస్ తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో షణ్ముఖ శ్రీనివాస్ కుటుంబ సభ్యులు, ఉర్లం శివతేజ, సిక్కోలు స్వచ్ఛంద సేవా సమితి సభ్యులు పొడుగు చరణ్, నవీన్, గిరజాల మహాలక్ష్మి, అవినాష్, చరణ్ పాల్గొన్నారు.



# శ్రీకాకుళాన్ని హరిత జిల్లాగా మార్చడమే లక్ష్యం



(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

శ్రీకాకుళాన్ని హరిత జిల్లాగా మార్చడమే లక్ష్యమని అక్షయ సేవా సమితి ప్రతినిధులు పేర్కొన్నారు. బుధవారం కొత్తపేట గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు బోడిగి మధు మాట్లాడుతూ జిల్లాలో అక్షయ సేవా సమితి ఆధ్వర్యంలో వెయ్యి మొక్కలు నాటడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్టు వివరించారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణకు కూడా ప్రత్యేక చర్యలు చేపడుతూ సంరక్షకులను ఏర్పాటు చేసి హరిత జిల్లాగా శ్రీకాకుళాన్ని మారుస్తామని వివరించారు. గ్రామ పెద్దలు పొన్నాడ అప్పలనాయుడు, బొడ్డేపల్లి సుధాకర్ మాట్లాడుతూ ఎచ్చెర్లను హరిత మండలంగా మార్చాలన్న లక్ష్యంతో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాలు చేపడుతున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పప్పల వెంకట రామమూర్తి, మొదలవలస లక్ష్మణరావు, అన్నపు శ్రీమన్నారాయణ, పైడి పురుషోత్తం, సేవాసమితి సభ్యులు కిరణ్ కుమార్, భవానీ శంకర్, జైకృష్ణ, మణికుమార్ పాల్గొన్నారు.

# జలమయమైన ప్రధాన రహదారి

(సత్యంన్యూస్, కొత్తూరు)

ఇటీవల కురిసిన వర్షాల కారణంగా హద్దుబంగి గెడ్డ పొంగి రోడ్ల మీద ప్రవహిస్తుంది. కొత్తూరు - నివగాం ప్రధాన రహదారి జలమయమైంది. సంబంధిత ఇరిగేషన్ శాఖ అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.



# రైతు సంక్షేమానికి ప్రాధాన్యత

**శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్**

**వంశధార కుడికాలువకు నీరు విడుదల**



(సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్)

ఐదేళ్ల వైకాపా పాలనలో సాగునీరందక, పండిన పంటకు గిట్టుబాటు ధర లేక, ధాన్యం కొనుగోలు చేయక రైతులను పూర్తిగా అప్పుల ఊబిలో నెట్టిందని, కూటమి ప్రభుత్వ పాలనలో రైతే రాజు అని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. అంపోలు పంచాయతీ లింగాలవలస లిఫ్ట్ ఇరిగేషన్ వద్ద వంశధార కుడికాలువలోకి నీటిని బుధవారం విడిచిపెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో వంశధార కుడికాలువ ద్వారా సాగునీటిని సకాలంలో అందజేయకపోవడంతో రైతులు నానా అవస్థలు పడ్డారని, కనీసం కాలువల్లో గుర్రపుడెక్కను సైతం తొలగించలేదని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కాలువల్లో పూడికతీత పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టి రైతులకు ఖరీఫ్‌కు వంశధార కుడికాలువ ద్వారా సకాలంలో నీరందించి వారి ముఖాల్లో ఆనందం నింపామన్నారు. రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటూ పండించిన ధాన్యం, ఇతర పంటలకు మద్దతు ధర కల్పిస్తామని, కౌలు రైతులు, రైతు కూలీలకు న్యాయం చేస్తామని చెప్పారు. ఈయనతో పాటు నీటిపారుదల శాఖ అధికారులు, టీడీపీ నాయుకలు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి



(సత్యంన్యూస్, టెక్కలి)

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరుతూ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుని ఆయన క్యాంపు కార్యాలయంలో సివిల్ సప్లై కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ యూనియన్ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన వద్ద వారి సమస్యలను విన్నవించుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక తమ సమస్యలు పరిష్కారమవుతాయని ఆశగా ఎదురు చూస్తున్నట్లు తెలిపారు. రెగ్యులైజ్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి సానుకూలంగా స్పందిస్తూ న్యాయం చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు యూనియన్ నాయకులు చెప్పారు. మంత్రిని కలిసిన వారిలో నాయకులు నర్సింగరావు, రాజేశ్వరి, సురేష్, కుమార్, అమర్ తదితరులున్నారు.

# మంత్రిని కలిసిన జెమ్స్ సీఈవో

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును రాగోలు జెమ్స్ ఆసుపత్రి సీఈవో స్వర్ణరామ్మోహన్ మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం నిమ్మాడలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కలిసి మంత్రిని దుశ్శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా జెమ్స్‌లో అందిస్తున్న సేవలపై వివరించారు. జెమ్స్ సేవలను ఉత్తరాంధ్రలోని జిల్లాల్లో విస్తృతం చేసినట్టు తెలిపారు. ఆయనతో పాటు జెమ్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.